
సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 27 । మార్చి । 2025



విభిన్న పంటల సాగు
ఆత్మకూరు(ఎం) మండలం పుల్లాయిగూడేనికి చెందిన కొప్పుల శైలజారెడ్డి సేంద్రియ సాగులో ఆదర్శంగా నిలుస్తోంది. - 8లో



ప్రయాణం.. ప్రాణ సంకటం
మోటకొండూరు నుంచి కాటేపల్లి మార్గంలో రాకపోకలు సాగించడం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. - 9లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (గురువారం సా॥)
సహర్ 4-51 (శుక్రవారం ఉ॥)

న్యూస్‌రీల్

టెన్త్ గణితం పరీక్షకు 8,620 మంది హాజరు

భువనగిరి, రాజాపేట : పదో తరగతి పరీక్ష ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన గణితం పరీక్షకు 50 కేంద్రాల్లో 8,632 మందికి గాను 8,620 మంది హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు. రాజాపేట, రఘునాథపురంలోని పరీక్ష కేంద్రాలను డీఈఓ సత్యనారాయణ తనిఖీ చేశారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారికి మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభులకు అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

చౌటుప్పల్ ఆస్పత్రి వైద్యులపై విచారణ

చౌటుప్పల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై ఇద్దరు డాక్టర్లతో కూడిన బృందం బుధవారం విచారణ చేపట్టింది. బీబీనగర్ మండలం వెంకిర్యాలకు చెందిన జివాజీ సాత్విక ప్రసవం కోసం ఈనెల 13న చౌటుప్పల్ ఆస్పత్రికి వచ్చింది. ఆరోగ్య సమస్యలున్నాయని వైద్యులు ప్రసవం చేయడానికి నిరాకరించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి కాన్పు చేయించుకుంది. చౌటుప్పల్ ఆస్పత్రి వైద్యుల తీరుతో మానసిక క్షోభ అనుభవించానని, వారిపై చర్యలు తీసుకోవాలని ఈనెల 24న స్థానిక పోలీసు స్టేషన్‌లో సాత్విక ఫిర్యాదు చేసింది. డీసీహెచ్‌ఎస్ ఆదేశాల మేరకు ఇద్దరు డాక్టర్లు ఆస్పత్రికి వచ్చి విచారణ చేశారు. అదే విధంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో డిశ్చార్జి రిపోర్టుతో భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని సాత్వికకు విచారణ అధికారులు సూచించారు. కాగా విచారణ ఏకపక్షంగా సాగిందని సాత్విక కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు.

నామినేషన్లకు నేడు చివరి గడువు

భువనగిరి టౌన్ : భువనగిరి బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల గడువు గురువారం ముగియనుంది. మొదటి రోజు బుధవారం ఎనిమిది మంది నామినేషన్ వేశారు. ఇందులో అధ్యక్ష పదవికి రెండు, ప్రధాన కార్యదర్శి పదవికి రెండు, ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శి, లైబ్రరీ, కల్చరల్‌కు సంబంధించి ఒక్కో నామినేషన్ దాఖలైంది. మహిళా రిప్రజెంటేటివ్, క్రీడల సెక్రటరీ, ఐదు ఎగ్జిక్యూటివ్ స్థానా లకు నామినేషన్లు దాఖలు కావాల్సి ఉంది. ఎన్నికల అధికారి భాస్కర్‌రెడ్డి నామినేషన్లు స్వీకరించారు. వచ్చే నెల 4వ తేదీన పోలింగ్ జరగనుంది.

పరీక్షలకు అనుమతించాలని హైకోర్టుకు..

శాలిగౌరారం: నాకేపాపం తెలియదు.. ప్రశ్నాపత్రం లీకేజీలో నా పాత్రలేదు.. పరీక్షా కేంద్రంలో కిటికీ పక్కన ఉన్న నన్ను కిటికీలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి బెదిరించి నా ముందున్న ప్రశ్నాపత్రాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నాడు. నన్ను అన్యాయంగా డిబార్ చేశారు. నా డిబార్‌ను రద్దు చేసి పరీక్షలకు అనుమతించాలి అని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థిని ఐల్లెం ఝాన్సీలక్ష్మి బుధవారం రాష్ట్ర హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయాన్ని ఆ విద్యార్థిని తల్లిదండ్రులు బుధవారం రాత్రి 'సాక్షి'కి వెల్లడించారు.

రాయితీ ఇచ్చినా అంతంతే..

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు.. ఐదు రోజులే గడువు

- మొత్తం 1,47,007 దరఖాస్తులు
- 1,34,208 దరఖాస్తులకు అనుమతి
- ఈనెల 25వ తేదీ వరకు 11,334 మంది ఫీజు చెల్లింపు
- అవగాహన కల్పించినా మందకొడిగానే..



ఆలేరులో వెంచర్ల యజమానులతో సమావేశమైన అదనపు కలెక్టర్ (ఫైల్)

సాక్షి,యాదాద్రి : లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించినా ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దరఖాస్తులు వేలల్లో ఉండగా.. ఫీజు చెల్లిస్తున్న వారు వందల్లోనే ఉంటుంది. యంత్రాంగం విస్తతంగా ప్రచారం చేసినా దరఖాస్తుదారులు ముందుకు రావడంలేదు. ముందస్తు కసరత్తు లేకుండా హడావుడి ప్రకటించడం, సిబ్బంది మధ్య సమన్వయ లోపం, సాంకేతిక సమస్యలు ఈ పరిస్థితికి కారణాలని తెలుస్తోంది.

రుసుము చెల్లించింది 11,334 మందే..

జిల్లాలోని 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు, వైటీడీఏ పరిధిలో ఓపెన్ ప్లాట్లు, వెంచర్ల క్రమబద్ధీకరణకు 1,47,007 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1,34,208 దరఖాస్తుల రెగ్యులరైజేషన్‌కు అనుమతి పొందాయి. వీటిని మార్చి 31వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తుదారులు గడువు లోపు పరిష్కరించుకుంటే 25శాతం రాయితీ కల్పిస్తామని ప్రకటించింది. కానీ, ఈనెల 25వ తేదీ వరకు కేవలం 11,334 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఇంకా 1,22,874 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి.

మున్సిపాలిటీల్లో ఇలా..

భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 61,078 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 52,902 దరఖాస్తులను క్రమబద్ధీకరణకు అధికారులు అనుమతించారు. వీటికి ఫీజు రాయితీ వర్తించనుంది. కానీ, 4,614 మంది మాత్రమే ఫీజు చెల్లించి ప్రొసిడింగ్స్ తీసుకున్నారు. ఇంకా 48,288 దరఖాస్తుదారులు రుసుము చెల్లించాల్సి ఉంది.

గ్రామ పంచాయతీల్లో..

గ్రామ పంచాయతీల్లో 63,642 దరఖాస్తులు రాగా.. 60,145 క్రమమబద్ధీకరణకు అనుమతి పొందాయి.

మున్సిపాలిటీల వారీగా దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	అనుమతి	ఫీజు చెల్లించినవి	చెల్లించాల్సినవి
భువనగిరి	15,549	12,916	913	12,003
ఆలేరు	5,220	4,059	417	3,642
చౌటుప్పల్	16,528	13,527	1,158	12,369
మోత్కూరు	3,650	3,495	393	3,102
పోచంపల్లి	7,535	7,115	573	6,542
యాదగిరిగుట్ట	12,596	11,790	1,160	10,630
మొత్తం	61,078	52,902	4,614	48,288
వైటీడీఏ పరిధిలో..				
భువనగిరి	4,981	4,603	366	4,237
యాదగిరిగుట్ట	17,306	16,558	1,867	14,691
మొత్తం	22,287	21,161	2,233	18,928
మండలాల్లో	63,642	60,145	4,487	55,658
మొత్తం	1,47,007	1,34,208	11,334	1,22,874

25 రోజులుగా ప్రచారం

25శాతం రాయితీపై అవగాహన కల్పించేందుకు అధికారులు ఈనెల1నుంచి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ మేళాలు నిర్వహించారు. ప్లాట్లు, వెంచర్ల యజమానులతో సమావేశమై రాయితీ గురించి వివరించారు. వార్డు ఆఫీసర్లతో ఫోన్లు చేయిస్తున్నారు. దరఖాస్తుదారుల ఫోన్లకు మెసేజ్‌లు పంపుతున్నారు. హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా రాయితీ గడువు ఈనెల 31తో ముగియనుండగా మరో నెల రోజులు పొడిగించాలని వివిధ రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.

ఇందులో 4,487 మంది ఫీజు చెల్లించగా ఇంకా 55,658 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి.

వైటీడీఏ పరిధిలో 18,928 పెండింగ్

వైటీడీఏ పరిధిలోని యాదగిరిగుట్ట, భువనగిరిలో 22,287 అక్రమ వెంచర్లు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 21,161 వెంచర్ల క్రమబద్ధీకరణకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఇందులో 2,233 వెంచర్లకు దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. ఇంకా 18,928 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా యజమానులు ముందుకు రావడం లేదు.

కారణాలివీ..!

దరఖాస్తులు వేలల్లో ఉండడం, సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత, సమన్వయం లేకపోవడం ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.



ఆలేరులో ఫీజు చెల్లించి ప్రొసీడింగ్స్ తీసుకుంటున్న ప్లాట్ యజమాని (ఫైల్)

అత్యాధునిక సేవలు మరింత మెరుగు



విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, పీడియాట్రిక్ విభాగం వైద్యులు

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: ఎయిమ్స్ వైద్య కళాశాలలో చిన్నారులకు అందజేస్తున్న అత్యాధునిక వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా పేర్కొన్నారు. ఎయిమ్స్‌లోని పీడియాట్రిక్ కేర్ యూనిట్‌లో 1,500 మంది చిన్నారులకు విజయవంతంగా ఆరోగ్య సేవలు అందజేసిన సందర్భంగా బుధవారం విజయోత్సవ కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు వైద్యసేవలను అందించడంలో వైద్యులు అంకితభావంతో పని చేస్తున్నారని, పీడియాట్రిక్ సేవలను మరింతగా మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ లెర్నింగ్ సెంటర్, పరిశోధన విభాగం డైరెక్టర్లు జీవీ. రమణరావు, పీడియాట్రిక్ విభాగం ప్రధాన అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

నీటి వృథా అరికట్టకపోతే అనర్థాలు

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల అధికారులు

చౌటుప్పల్ : నీటి వృథాను అరికట్టకపోతే భవిష్యత్‌లో అనర్థాలు తప్పవని, ఇళ్లల్లో వినియోగించిన నీటిని రీసైకిలింగ్ చేసి తాగుతున్న దేశాల దుస్థితి మనకు కూడా వచ్చే ప్రమాదం ఉందని అదనపు కలెక్టర్ వీరారెడ్డి హెచ్చరించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం చౌటుప్పల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి విధ్వంసం వల్ల కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉందని, జిల్లాలో చౌటుప్పల్ వెనుకంజలోనే ఉందన్నారు. అటవీ విస్తీర్ణం 33 శాతానికి గాని జిల్లాలో 20 – 22శాతమే ఉందని, చౌటుప్పల్ ప్రాంతంలో అతి తక్కువగా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితులను అరికట్టాలంటే ప్రతి పౌరుడు నీటి సంరక్షణపై దృష్టి సారించాలని, ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వివిధ కారణాలతో తొలగించబడిన భారీ వృక్షాల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. రైతులు పంటల సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని, నీటి వినియోగం తక్కువగా అవసరమయ్యే పంటలు వేయాలని సూచించారు. అంతకుముందు నీటి సంరక్షణ, పొదుపు, అడవుల విస్తరణ, ప్రకృతిని కాపాడుకోవడం వంటి అంశాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆయా శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జలవనరుల శాఖ అదనపు డైరెక్టర్ జ్యోతికుమార్, అటవీ, ఉద్యాన, వ్యవసాయ, మత్స్య శాఖ అధికారులు పద్మజారమణ, సుహాసిని, రాజారామ్, గోపాల్, శోభారాణి, నర్సింహారెడ్డి, హరికృష్ణ, విజయ్‌కుమార్‌రెడ్డి, సార్ప్ సంస్థ అధ్యక్షురాలు ప్రమీల పాల్గొన్నారు.

రహదారి భద్రత.. జీవితానికి రక్షణ



జలాల్‌పురం చెరువుకట్ట మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన బ్లింకింగ్ లైట్లను ప్రారంభిస్తున్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో దాత వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు

- చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని చౌటుప్పల్ ఏసీపీ మధుసూధన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం చెరువుకట్ట మూలమలుపు వద్ద హైదరాబాద్‌కు చెందిన శుభ ఫెర్టిలిటీ హాస్పిటల్ ఎండీ గోరంటి వినయ్‌కుమార్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన సోలార్ బ్లింకింగ్ ట్రాఫిక్ లైట్లు, రోడ్డు డివైడర్లు, స్టాపర్స్, హెచ్చరిక బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టామన్నారు. అదే విధంగా వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరుబయట నిద్రించవద్దన్నారు. యువత బెట్టింగ్ జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం దాత వినయ్‌కుమార్‌రెడ్డితో పాటు చెరువుకట్ట వద్ద సొంత ఖర్చులతో చెట్లను తొలగించిన శుభ్రం చేసిన గోరంటి ప్రదీప్‌రెడ్డిని ఏసీపీలు సన్మానించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్, ఎస్‌ఐలు కంచర్ల భాస్కర్‌రెడ్డి, వంశీ, ఏఎస్‌ఐ సైదిరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది నాయకులు కొట్టం కరుణాకర్‌రెడ్డి, పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, బైరు బాలరాజు, బైరు వెంకటేశ్, పాలకూర్ల ఆగయ్యగౌడ్, మక్బూల్ పాల్గొన్నారు.

భువనగిరి బడ్జెట్ రూ.44.27 కోట్లు

- గత సంవత్సరంతో పోలిస్తే రూ.4 కోట్లు తగ్గింపు
- ఆదాయం రూ.44.16 కోట్లు, మిగులు రూ.11.47లక్షలు..
- ఆమోదం తెలిపిన మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి వీరారెడ్డి



భువనగిరి టౌన్ : ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వ యంత్రాంగాలు ముందుకు సాగుతుంటే భువనగిరి మున్సిపాలిటీలో మాత్రం నిధుల కేటాయింపులు తగ్గిస్తూ వెనక్కి వెళ్తోంది. గత రెండు, మూడు పర్యాయాలుగా ప్రతి సంవత్సరం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటూ పోతుండగా ఈసారి బడ్జెట్‌లో కోత పెట్టారు. గత ఏడాది పోలిస్తే రూ.4 కోట్లు తగ్గించారు.బడ్జెట్‌లో అత్యధికంగా సిబ్బంది వేతనాలు, ఖర్చులకే పోతున్నాయి. ఆ తర్వాత నీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగానికి ప్రాధాన్యమిచ్చారు.

రాబడి ఇలా..

2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను భువనగిరి మున్సిపల్ బడ్జెట్‌ను రూ.44,27,47000 అంచనాలతో రూపొందించారు. మొత్తం బడ్జెట్‌లో ఆదాయం రూ.44.16 కోట్లు, మిగులు రూ.11.47 లక్షలుగా ప్రతిపాదించారు. రాబడి విషయానికొస్తే ప్రారంభ నిలువ రూ.4.93 కోట్లు, పన్నులు, బదిలీ ఆదాయం రూ.15.37 కోట్లు, అద్దెల ద్వారా రూ.కోటి 68 లక్షలు, పారిశుద్ధ్య విభాగం రూ.54.6 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం రూ.4.03 కోట్లుగా బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగం రూ.1.70 కోట్లు, క్యాపిటల్ ఫండ్ రూ.14.08 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సుల రూపకంలో రూ.1.92 కోట్లు.. మొత్తంగా రూ.44,27,47000 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందన్న అంచనాతో రూపొందించారు.

నిధులపై ఆశలు సన్నగిల్లాయా?

గత మున్సిపల్ బడ్జెట్‌ను రూ.44,23,42000 రూపకల్పన చేయగా.. ఈ సారి వెనకడుగు వేశారు. నిధులపై ఆశలు సన్నగిల్లడంతోనే సుమారు రూ.4కోట్లు తగ్గించి బడ్జెట్ రూపకల్పన చేశారన్న విమర్శలున్నాయి. బడ్జెట్‌ను పెంచాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

బడ్జెట్‌కు ఆమోదం

బడ్జెట్‌కు మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. రాబడి, వ్యయానికి అనుగుణంగా పనులు చేపట్టాలని, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వృథా ఖర్చులను తగ్గించుకోవాలని పేర్కొన్నారు.

వేతనాలు, ఖర్చులకే ఎక్కువ

బడ్జెట్‌లో అత్యధికంగా వేతనాలు, తప్పనిసరి ఖర్చులకు రూ.5.90 కోట్లు కేటాయించారు. ఆ తరువాత నీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగానికి రూ.4.85 కోట్లు వెచ్చించారు. ఇక పారిశుద్ధ్య నిర్వహణకు రూ.2.87 కోట్లు, విద్యుత్ బిల్లులు రూ.2.56 కోట్లు, రుణాల చెల్లింపులు రూ.1.50 కోట్లు, హరిత బడ్జెట్ రూ.2.33 కోట్లు, పరిపాలన వ్యయం రూ.2.14 కోట్లు, పట్టణ ప్రణాళిక విభాగం రూ.20.05 లక్షలు, అభివృద్ధి చెందని, బలహీన వర్గాల ప్రాంతాల అభివృద్ధికి రూ.32.37 లక్షలు, ప్రజా సౌకర్యాలకు రూ.కోటి 42 లక్షలు, వార్డుల వారీగా అభివృద్ధికి రూ.4.05 కోట్లు.. మొత్తం వ్యయం రూ.44.16 కోట్లుగా పేర్కొన్నారు. మిగులు ఆదాయం రూ.11.47 లక్షలు ఉంటుందన్నారు.

పెద్ద అంబర్‌పేటలోకి సాయినగర్

- విలీనం చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



భూదాన్‌పోచంపల్లి : మండలంలోని సాయినగర్ గ్రామ పంచాయతీ రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనమైంది. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్)కు లోపల ఉన్న 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఇటీవల ఆర్డినెన్స్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా సాయినగర్ గ్రామ పంచాయతీని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. కాగా సాయినగర్ 2019 వరకు దేశ్‌ముఖి గ్రామ పంచాయతీ ఆవాసంగా ఉండేది.

2019లో పంచాయతీగా ఏర్పాటు

2019లో సాయినగర్‌ను నూతన పంచాయతీగా ఏర్పాటైంది. తమ గ్రామాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో కలపాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు సాయినగర్‌ను పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేసింది. ఇప్పటి వరకు భూదాన్‌పోచంపల్లి మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా.. సాయినగర్ విలీనంతో 21కి తగ్గాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌ఓ మనోహర్

యాదగిరిగుట్ట రూరల్ :ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని డీఎంహెచ్‌ఓ మనోహర్ పేర్కొన్నారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో నిర్వహించిన అమ్మకు భరోసా కార్యక్రమంలోనాయన పాల్గొన్నారు. గ్రామంలోని శిరీష అనే గర్భిణి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందజేస్తున్న వైద్యసేవలు, ఇతర ప్రయోజనాల గురించి ఆమెకు వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని, యోగా చేయాలన్నారు. సాధారణ ప్రసవం వల్ల ప్రయోజనాలను, సిజేరియన్ ఎదురయ్యే అనర్థాలను ఆమెకు తెలియజేశారు. అనంతరం శిరీషకు న్యూట్రిషన్ కిట్ అందజేశారు.



శిరీషకు న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ మనోహర్

కాంగ్రెస్ నేతల అక్రమాలను ప్రశ్నిస్తే కేసులా?



యాదగిరిగుట్టలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్

యాదగిరిగుట్ట : కాంగ్రెస్ నాయకుల అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ ఆరోపించారు. యాదగిరిగుట్ట బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ తదితరులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారిపై బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట పట్టణంలో వ్యాపారుల నుంచి సీ ట్యాక్స్ పేరుతో కాంగ్రెస్ నాయకులు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించిన బీజేపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి, భయాందోళనకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ వారిపై కేసులను ఉపసంహరించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అంతకు ముందు ప్లకార్డులతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందమహేందర్, కార్యదర్శి కాధూరి అచ్చయ్య, స్టేట్ కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, జిల్లా భానుచందర్, పట్టణ ఉపాధ్యక్షుడు బందారపు మల్లేష్‌గౌడ్, కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బుచ్చిబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మందోజు నరేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుడుగు రాజిరెడ్డి, నాయకులు భువనగిరి శ్యాంసుందర్, గుంటిపల్లి సత్యం, కల్లెం శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల భాస్కర్‌రెడ్డి, కర్రె బీరుమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డిగూడెం పంచాయతీ సేవలు భేష్

- జెడ్పీ సీఈఓ శోభారాణి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శోభారాణి, చిత్రంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి

భూదాన్‌పోచంపల్లి : శివారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న తీరు బాగుందని, ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్రస్థాయికి నామినేటెడ్ కావడం అభినందనీయమని జెడ్పీ సీఈఓ శోభారాణి పేర్కొన్నారు. బుధవారం ఆమె డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునందతో కలిసి భూదాన్‌పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, లైసెన్స్‌ల జారీ, ఉపాధిహామీ కూలీలకు వేతనాల చెల్లింపు, మ్యుటేషన్, భవన నిర్మాణాలకు అనుమతులు ఆన్‌లైన్ ద్వారా అందజేస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. పౌరసేవలకు సంబంధించి వీడియోగ్రఫీ చేయాలని కార్యదర్శి రజితకు సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రీఫామ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్(డీఏఆర్‌పీజీ) రాష్ట్రస్థాయి అవార్డుకు జిల్లా నుంచి శివారెడ్డిగూడెం నామినేటెడ్ అయ్యిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని త్వరలో సందర్శించనున్నారని అన్నారు. అనంతరం వంకమామిడి, రేవనపల్లి గ్రామ పంచాయతీలను సదర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఏపీఓ కృష్ణమూర్తి, ఏపీఎం నీరజ, పంచాయతీ కార్యదర్శి రజిత, సీసీ వసంత, ఎఫ్‌ఏ శ్రీశైలం, నాయకులు వారాల రాంచంద్రారెడ్డి, పీసర్ల వసంత, గండు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. బుధవారం చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన కత్తుల అఖిల్(25) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అతడు బైక్‌పై హైదరాబాద్ నుంచి నల్లగొండకు వస్తుండగా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే హైదరాబాద్‌నుంచి ఖమ్మం జిల్లా మధిరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి మంగమ్మ బుధవారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నూతనకల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం మిర్యాల గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన కళ్లెపల్లి పవన్ తన బావమరిది బొప్పాని రిషి(10)తో కలిసి బైక్‌పై చిననెమిల క్రాస్ రోడ్డు వైపు వెళ్తుండగా.. మిర్యాల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనకాల కూర్చున్న రిషి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేటకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా బైక్ నడిపిన కళ్లెపల్లి పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిక్కెట్ మిషన్ పనిచేయక నిలిచిన ఆర్టీసీ బస్సు

మోత్కూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన ఆర్టీసీ బస్సు టిక్కెట్ మిషన్ పనిచేయకపోవడంతో బుధవారం మధ్యాహ్నం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం వద్ద నిలిచిపోయింది. ఈ బస్సు మోత్కూరు, అనాజిపురం, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంది. బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉండగా తొర్రూరులో ఎక్కిన ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చారు. కానీ మోత్కూరు వద్ద ఎక్కిన ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వలేకపోయారు. టిక్కెట్లు ఇవ్వకుండా ప్రయాణికులకు తీసుకెళ్లలేమని కండక్టర్ తెలిపారు. బస్సు నిలిచిపోవడంతో ఎండలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్–2 డిపో మేనేజర్‌ను సంప్రదిస్తే టిక్కెట్లకు బదులుగా పేపర్‌పై రాసి ఇవ్వాల్సిందిగా కండక్టర్‌కు సూచించారు. దీంతో గంటన్నర తరువాత బస్సు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లింది.

‘నవోదయ’ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు 80 మంది
- తొమ్మిదో తరగతికి 11 మంది ఎంపిక

పెద్దవూర: పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ)లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి గాను నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ కేవీ నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతికి 80మంది విద్యార్థులు, తొమ్మిదో తరగతికి 11మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి అడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను పూర్తిగా నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లను ఏర్పాటు చేసుకుని డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రవేశానికి సంబంధించిన అన్ని ఫారాలను దరఖాస్తు సమయంలో విద్యార్థులు పొందుపర్చిన చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపనున్నట్లు తెలిపారు.


చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం

ఆరో తరగతికి ఎంపికైన విద్యార్థుల హాల్‌టిక్కెట్ల నంబర్లు ఇవీ..

ఎస్3612880, జే3612939, జే3613798, ఎల్3614099, ఎల్3615167, ఎల్3615247, ఈ3615345, కే3615353, జే3612100, జే3612885, జే3613021, ఎస్3613056, జే3615510, కే3612418, కే3613797, ఓ3615174, జే3612099, ఎస్3612810, పీ3615188, పీ3615245, జే3611651, కే3612005, ఐ3612025, ఎస్3612082, జే3612095, ఎం3612189, ఎం3612205, జే3612614, ఎల్3612684, జే3612935, జే3613071, జే3613516, జే3613595, ఎస్3613632, ఓ3613790, జే3613909, ఎల్3613947, జే3614077, జే3614279, జే3614369, జే3615170, ఎల్3615177, ఎస్3615302, ఎం3615534, ఎస్3615757, కే3616005, జే3616054, జే3612097, జే3612297, జే3612971, ఎస్3613114, ఎస్3613189, ఎస్3614220, జే3614222, జే3614360, జే3614944, జే3615001, జే3615117, ఎస్3615195, జే3615317, ఎస్3615485, జే3615976, జే3616031, కే3612119, కే3612345, ఓ3612955, కే3613362, ఓ3614631, కే3614747, కే3615019, కే3615867, కే3615992, కే3616067, పి3612748, ఎల్3615157, పి3615194, పి3615203, పి3615219, ఎల్3615250, పి3615367.

తొమ్మిదో తరగతికి ఎంపికైన విద్యార్థుల హాల్‌టిక్కెట్ల నంబర్లు..

342075, 342215, 341978, 342267, 342121, 342002, 342120, 341595, 341761, 342096, 342173.

పోలీసుల అదుపులో నగల షాపు యజమాని

- అధిక వడ్డీ ఆశచూపి పలువురి వద్ద డబ్బులు, నగదు తీసుకొని పరార్

యాదగిరిగుట్ట: అధిక వడ్డీ ఆశచూపి యాదగిరిగుట్ట పట్టణంలోని పలువురి వద్ద నగదు, నగలు తీసుకొని పరారైన స్థానిక జైభవానీ జువెల్లర్స్ యజమానిని ఎట్టకేలకు బుధవారం పోలీసులు పట్టుకున్నారు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 24న సుమారు రూ.10కోట్లతో జైభవాని జువెల్లరీ యజమాని జితేందర్‌లాల్‌తో పాటు మధు రాములు అనే వ్యక్తి పరారయ్యారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో జితేందర్‌లాల్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా బుధవారం జితేందర్‌లాల్, మధు రాములు చిట్యాలలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఒక కేజీ 85 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. మరో కేజీ 946 గ్రాముల బంగారం బ్యాంక్‌లో ఉన్నట్లు గుర్తించి సీజ్ చేయించారు. అంతేకాకుండా జితేందర్‌లాల్, మధు రాములు వద్ద ఉన్న 64కిలోల 620గ్రాముల


జితేందర్‌లాల్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వెండి ఆభరణాలతో పాటు కారును సైతం సీజ్ చేశారు. బంగారం, వెండి ఆభరణాలను కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు సీఐ తెలిపారు. జితేందర్‌లాల్, మధు రాములును రిమాండ్ చేశామని వెల్లడించారు. జితేందర్‌లాల్‌ను పోలీసులు పట్టుకున్న విషయం తెలుసుకున్న బాధితులు భారీగా యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమ బంగారంతో పాటు నగదును త్వరగా ఇప్పించాలని బాధితులు సీఐ రమేష్‌ను కోరారు.

‘పది’ పరీక్ష కేంద్రం వద్ద చిట్టీల కలకలం

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం జి.తిర్మలగిరి జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో బుధవారం పదో తరగతి మ్యాథ్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు కొందరు చిట్టీలు అందించినట్లు సమాచారం. ఈ పాఠశాలలో జి.తిర్మలగిరి, తిమ్మాపురం, దురాజ్‌పల్లి, గుంజలూరు, ఖాసీంపేట గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలతో పాటు దురాజ్‌పల్లిలోని ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 136 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కాగా ముస్లిం మైనార్టీ పాఠశాలకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు 500 మీటర్ల దూరంలో కారులో కూర్చొని చిట్టీలు పాఠశాలకు పంపిస్తుండటంతో విలేకరులు గమనించి ఫొటోలు తీస్తుండగా అక్కడ నుంచి పరారయ్యారు. ఈ విషయమై మండల విద్యాధికారి రమణ, పరీక్ష కేంద్రం చీఫ్ మిర్యాల


పరీక్ష కేంద్రానికి సమీపంలో ఆగి ఉన్న కారులోని చిట్టీలు

అమృతారెడ్డిని వివరణ కోరగా.. పాఠశాలలోకి ఎలాంటి చిట్టీలు రాలేదన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

సూర్యక్షేత్రం వ్యవస్థాపకుడు జనార్దన్ స్వామి మృతి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి అలియాస్ జనార్దన్ స్వామి (46) బుధవారం రాత్రి మృతిచెందారు.


జనార్దన్ స్వామి (ఫైల్)

కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జనార్దన్ స్వామి 2002లో తిమ్మాపురం శివారులో గుట్టల మధ్యన రాష్ట్రంలోనే మొదటిదైన సూర్యక్షేత్రాన్ని తన సొంత ఖర్చులతో నిర్మించారు. దీని నిర్మాణానికి సుమారు రూ.2కోట్లకు పైగానే ఖర్చు చేశారు. జనార్దన్ స్వామి స్వగ్రామం తుంగతుర్తి మండలం సంగెం గ్రామం కాగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. హయత్‌నగర్ సమీపంలోని శ్మశాన వాటిక నందు గురువారం అంత్యక్రియలు జరుగుతాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

మోత్కూరు: వేర్వేరు చోట్ల ముగ్గురు యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మోత్కూరు మండలం దత్తప్పగూడేనికి చెందిన యువకుడు తండ్రి మందలించాడని మన స్తాపానికి గురై సెల్‌ఫోన్ క్లీనింగ్ చేసే లిక్విడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.


ప్రజ్వల్ (ఫైల్)

వివరాలు.. దత్తప్పగూడెం గ్రామానికి చెందిన సీలం సిల్వరాజ్ రెండో కుమారుడు ప్రజ్వల్ (20) గ్రామంలో మొబైల్ రిపేర్ పనులు చేసుకుంటూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. మంగళవారం ప్రజ్వల్‌ను తండ్రి సిల్వరాజ్ మందలించాడు. మనస్తాపానికి గురైన ప్రజ్వల్ బుధవారం సెల్‌ఫోన్ క్లీనింగ్ చేసే లిక్విడ్ తాగాడు. కుటుంబ సభ్యులు భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మానసికస్థితి సరిగా లేని..

నడిగూడెం: మానసికస్థితి సరిగా లేని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం నడిగూడెం మండల కేంద్రం పరిధిలో జరిగింది. ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన దేవరంగుల లక్ష్మయ్య, భద్రమ్మ దంపతుల


యల్లయ్య (ఫైల్)

పెద్ద కుమారుడు యల్లయ్య(39)కు కొద్దిరోజులుగా మానసిక స్థితి సరిగ్గా ఉండటంలేదు. బుధవారం యల్లయ్య నడిగూడెం నుంచి కలకోవకు వెళ్లే రహదారిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలాల వద్దకు వెళ్తున్న వారు చూసి యల్లయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య వనజ, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన యువకుడు శవమై..

రాజాపేట: ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం మల్లగూడెం గ్రామానికి చెందిన రెడ్డి


హరిబాబు (ఫైల్)

బోయిన మల్లేష్, లావణ్య దంపతుల పెద్ద కుమారుడు హరిబాబు(19) శుక్రవారం ఇంటి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి మల్లేష్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా బుధవారం కొండ్రెడ్డి చెరువు, మల్లగూడెం గ్రామాల శివారు ప్రాంతంలో హరిబాబు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. పరిసర ప్రాంత రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నూతనకల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం లింగంపల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి గ్రామానికి చెందిన కారింగుల లక్ష్మణ్(22) విద్యుత్ లైన్‌మెన్ కుర్వా వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలోని ఓ వీధిలో విద్యుత్ లైన్ తెగి వేలాడుతుందని గ్రామానికి చెందిన రవి లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా.. లైన్‌మెన్ సూచన మేరకు లక్ష్మణ్ ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి విద్యుత్ లైన్ సరిచేసేందుకు స్తంభం ఎక్కాడు. స్తంభం పైనుంచి 11కేవీ లైన్ ఉండటంతో విద్యుత్ సరఫరా అవుతుందా లేదా అని లక్ష్మణ్ టెస్టర్‌తో చెక్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్‌ని వివరణ కోరగా.. విద్యుత్ లైన్‌మెన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసేందుకు గాను సబ్ స్టేషన్‌లో స్కిల్డ్ లేబర్‌గా పేరు నమోదు చేసుకోవాలని, కానీ లక్ష్మణ్ సబ్ స్టేషన్‌లో ఎటువంటి పేరు నమోదు చేసుకోలేదని పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

చివ్వెంల(సూర్యాపేట): ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండలం తుల్జారావుపేట గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుల్జారావుపేట గ్రామానికి చెందిన బానోతు సీతారాం(75) రోజుమాదిరిగానే బుధవారం కూడా తన పశువులను మేపేందుకు గ్రామ శివారులోని తుమ్మల చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పశువులు చెరువులోకి దిగాయి. వాటిని బయటకు తోలుకొచ్చేందుకు సీతారాం చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. మృతుడి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.4.43కోట్లు


హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలను బుధవారం కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి సమక్షంలో ఆలయాధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.4,43,04,995 నగదు వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. మిశ్రమ బంగారం 296 గ్రాములు, మిశ్రమ వెండి 13 కిలోలు వచ్చిందని వెల్లడించారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, సింగపూర్, ఖతార్, ఒమన్, కెనడా, మలేషియా, కువైట్, న్యూజిలాండ్, భూటాన్, ఇండోనేషియా, నైజీరియా, శ్రీలంక, థాయిలాండ్, క్రోనర్, మారిషస్, పోలాండ్ దేశాలకు సంబంధించిన కరెన్సీ కూడా హుండీల్లో లభించాయని ఈఓ తెలిపారు. ఈ హుండీ ఆదాయం 65 రోజులదని ఆయన పేర్కొన్నారు.

నకిలీ బంగారం విక్రయం

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్ట్

ఆత్మకూర్ (ఎస్): తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి నకిలీ బంగారాన్ని అంటగట్టే ప్రయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి నెమ్మికల్ గ్రామంలోని గంగరబోయిన శ్రీనివాస్ ఇంటికి వచ్చి తన వద్ద బంగారం ఉందని, తక్కువ ధరకే ఇస్తానని బేరం ఆడాడు. అతడి వ్యవహారాన్ని చూసిన శ్రీనివాస్ అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి సదరు వ్యక్తి వద్ద ఉంది నకిలీ బంగారంగా గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

హాలియా: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చని అమెరికా దేశానికి చెందిన ఇంజనీర్లు క్రీస్, థరోట అన్నారు. శ్రీశైలం దేవాలయాన్ని దర్శించుకున్న వారు తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో బుధవారం హాలియా పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇక్కడ అమలవుతున్న విద్యావ్యవస్థ గురించి ఆరా తీసి పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థి దశ నుంచే భాషపై పట్టు ఉన్నట్లయితే కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. వారి వెంట పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు మోదాల రవీందర్, ఎన్. గోపినాయర్, మహమ్మద్ కరీం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో అమెరికాకు చెందిన ఇంజనీర్లు క్రీస్, థరోట

పర్యావరణాన్ని కాపాడేలా పంటలు సాగు చేయాలి

- ఉమ్మడి జిల్లాలోని రైతులకు వరి విత్తే విధానంపై శిక్షణ

త్రిపురారం: పర్యావరణాన్ని కాపాడేలా పంటలు సాగు చేయాలని త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కంపాసాగర్ కేవీకేలో ఉమ్మడి జిల్లాలోని రైతులకు వరి విత్తనాలు నేరుగా విత్తే విధానం–యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వరి విత్తనాలను నేరుగా విత్తుకోవడం ద్వారా కూలీల కొరత, శ్రమ, పెట్టుబడి తగ్గడంతో పాటు చీడపీడలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. వరి పంటను దమ్ము చేసి పండించడం వల్ల మీథేన్ గ్యాస్ విడుదల అవుతుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సుస్థిరంగా ఉత్పాదకత ఎలా చేపట్టాలి, యాంత్రాలను ఏవిధంగా ఉపయోగించాలి,


రైతులకు వరి విత్తనాలు నేరుగా విత్తే విధానంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

సేంద్రియ వ్యవసాయం, సమతుల్య ఎరువుల యాజమాన్యం, నేలలో సేంద్రియ కర్బనాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరి పరిశోధన స్థానం హెడ్ లింగయ్య, త్రిపురారం మండల వ్యవసాయాధికారి పార్వతి చౌహాన్, డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో విభిన్న పంటల సాగు

- సుమారు 11 ఎకరాల్లో మామిడి తోట పెంపకం
- అందులో అంతర పంటలుగా వేరుశనగ, పుచ్చకాయ, మినుములు, పెసర, వక్క, రుద్రాక్ష సాగు
- ఆకుకూరలు, కూరగాయలు కూడా..
- సాగు నీటి కొరతను అధిగమించడానికి డ్రిప్, ఫాంపాండ్, రెయిన్ గన్‌ల ఏర్పాటు
- యూట్యూబ్‌లో చూసి సాగు చేపట్టిన శైలజారెడ్డి

ఆత్మకూరు(ఎం): ఆమెకు సేంద్రియ వ్యవసాయం చేయడమంటే ఇష్టం. సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు పండిస్తే భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆమె ఆలోచన. దీంతో యుట్యూబ్‌లో చూసి సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం నేర్చుకుంది. తమకున్న వ్యవసాయ భూమిలో భర్త ప్రోత్సాహంతో సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల పంటలు సాగు చూస్తూ సక్సెస్ అయ్యింది.


తోటలోని ఫాంపాండ్


నాటడానికి తెచ్చిన మొక్కలకు సేంద్రియ ఎరువు వేస్తున్న రైతు శైలజారెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల శైలజారెడ్డి, కృపాకర్‌రెడ్డి దంపతులకు గ్రామంలో 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కృపాకర్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. వీరికున్న భూమిలో 4 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. మిగతా 11 ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయలు సాగును చేయాలని శైలజారెడ్డికి ఆలోచన రాగా భర్త కృపాకర్‌రెడ్డి సహకరించాడు. దీంతో గతేడాది 11 ఎకరాల్లో మామిడి తోట పెట్టారు. ఈ తోటలో మహాగని, గోల్డెన్ మ్యాంగో, థాయ్‌లాండ్, మ్యాన్‌డాక్, ఆపిల్ బేర్ రకాలతో పాటు అంతర పంటలుగా నాలుగు ఎకరాల్లో వేరుశనగ, మూడెకరాల్లో పుచ్చకాయ, దీంతో పాటు మినుములు, పెసర, పోక చెక్క, రుద్రాక్ష, బ్లాక్‌బేర్,


తోటలోని మొక్కలకు ఏర్పాటు చేసిన షేడ్ నెట్

మహాబిల్వం మొక్కలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా బ్రెజిల్ పాలకూర, చిక్కుడు, వంకాయ, కాశీ టమాట, చెర్రి టమాట, చిక్కుడు, సోరకాయతో పలు రకాల ఆకు కూరలు, కూరగాయలు కూడా సాగు చేస్తున్నారు.

ఫాంపాండ్, డ్రిప్ సహాయంతో..

ఈ 11 ఎకరాల్లో భూసారం దెబ్బతినకుండా శైలజారెడ్డి జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా వివిధ రకాల ఆకులతో తయారుచేసిన జీవామృతం, వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేస్తోంది. నాలుగు బోర్లు మాత్రమే ఉండటం, అవి కూడా అంతంత మాత్రంగానే పోస్తుండడంతో నీటి కొరతను అధిగమించడానికి ఫాంపాండ్ నిర్మాణం, డ్రిప్ ఏర్పాటు కోసం ఉద్యానశాఖకు దరఖాస్తు చేయగా రూ.75వేల సబ్సిడీతో రూ.5లక్షల రుణం మంజూరు అయ్యింది. దీంతో తోటలో డ్రిప్ ఏర్పాటుతో పాటు ఫాంపాండ్ నిర్మాణం చేశారు. బోరు నుంచి వచ్చిన నీటిని ఫాంపాండ్‌లో నిల్వ చేస్తున్నారు. ఫాంపాండ్ నుంచి డ్రిప్ సహాయంతో మొక్కలకు నీరు అందిస్తున్నారు. జీవామృతం, వర్మీ కంపోస్టు ఎరువులను కూడా డ్రిప్ ద్వారానే మొక్కలకు అందిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసేలా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహించాలి. సబ్సిడీపై రుణాలు అందించాలి. సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాలి. సేంద్రియ పద్ధతితో పండించిన ఆహార పదార్థాలను తింటే ఆరోగ్యం కూడా బాగుంటుంది. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడానికి ముందుకొచ్చే రైతులకు అవగాహన కల్పిస్తాను.

– కొప్పుల శైలజారెడ్డి

రెయిన్ గన్‌ల ఏర్పాటు

మామిడి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న వేరుశనగ, పుచ్చకాయ, మినుములు, పెసర, పాక చెక్క పంటలకు నీరు అందించడానికి రెయిన్ గన్‌లను ఏర్పాటు చేశారు. ఒక్క రెయిన్ గన్ సుమారుగా 30 మీటర్ల దూరం వరకు నీటిని వెదజల్లుతుంది. కోతుల బెడద నుంచి రక్షించుకోవడానికి తోట చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. తాము 11 ఎకరాల్లో పంటలను పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహం ఉంటే రైతులు సేంద్రియ పద్ధతిలో పంటల సాగుకు ముందుకొస్తారని శైలజారెడ్డి అంటున్నారు.


మామిడి తోటలో ఏర్పాటు చేసిన రెయిన్ గన్స్